

# తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

3౫

అన్నమాచార్యుల రచన : (చరిత్రపీఠికలో నుద్ధృతము. పు. ౧౦౭.)

రామక్రియ - ఆదితాళం

[పల్లవి]

(౧) , రి స్ని స సా గ రి గా | , పా , ప పా ప మా గ గా
చా లెద ని ది యే స త్య ము సుం డ్లో

(౨) , రి స్ని స సా గ రి ప మ గ రి గా | , పా , ప పా ప మ ధ మ గా
చా లె ద ని ది యే స త్య ము సుం డ్లో

(౩) , గ స్ని స గా ప మ గ రి స రి గ మ | పా ప ధా ప ధా సా , ని ధ ప మ గా
చా లె ద ని ది యే స త్య ము సుం డ్లో

(౪) , గ స్ని స గా ప మ గ రి సా రి గ మ | ప ధ స ని గ రి స ని ధ స ని ధ ప మ గా
చా లె ద ని ది యే స త్య ము సుం డ్లో

(౧) , గ గ గ మ గా రి స న్ని | స గ రి గ పా ప ధ ప మ గ రి ప మ
చేటు తే ద త ని సే విం చి న ను

(౨) గ రి గ మ గ మ గ రి స రి స ర స న్ని | స గ గ రి గ ప ప మ ప ధ ని , ధ ప మ
చే టు తే ద తి ని సే విం చి న ను
గ రి స రి న్ని స రీ
చా లె ద

[చరణం]

(౧) , ప ధా పా , ప ప పా | , మ పా మ పా మ ధ మా గా
హ రి నొ ల్ల ని వా ర సు ర లు సుం డ్లో

(౨) , ప ధా ధ ప మ గ గ పా | మ ప ధా ప ధా ప ధ నీ ధ ప మ గ
హ రి నొ ల్ల ని వా ర సు ర లు సుం డ్లో

(౩) , ధ నీ ధ ప మ గ రి సా గ రి గ మ | ప మ ప ధా స నీ ధ ని సా రి స నీ ధ మ గ
హ రి నొ ల్ల ని వా ర సు ర లు సుం డ్లో
, గ ధా ప గ రి ప స స రి స్నీ | , స సా గ రీ గా , ,
సు ర లీ త ని దా సు లు సుం డ్లో

(౧) , ప ధా ప మ గ మ ధ స స | , ధ సా స సా స ని గ రి సా
ప ర మా త్ము డి త డె ప్రా ణ ము సుం డ్లో

(౨) , ,, ,, | , రి నీ స గా గ రీ , సా
ప్రా ణ ము సుం డ్లో
, స రీ స సా సా స ని ధ ధ ప మ | గ మ ప ధ సా , ని ధ ధ ప మ , గ రి ప మ
మ రు గ క మ ఱ చి న మ తి తే ద క ను
గ రి (చాలెద)

ఇట్లే క్రింది చరణములు :

(౨) వేదరక్షకుడు - విష్ణుడు సుండ్లో !
సోదించె శుకు డ - చ్చుగ సుండ్లో !
ఆదిబ్రహ్మ గ - న్నాతడు సుండ్లో !
యేదెస వెదకిన - నితడే ఘనుడు (చాలెద)

(౩) ఇహపర మొసగను - యీతడె సుండ్లో !
వహి నుతించె బా - ర్యతి సుండ్లో !
రహస్య మిదివో - రహి శ్రీ వేంక ౦
మహీధరంబున - మనికై నిలిచె. (చాలెద)

**లఘుటీక :** మఱుగక = విడిచియుండజాలనంత తగులము లేక; సోదించె శుకుడు = శ్రీ భాగవతమందు శుకమహర్షి దీనిని తేల్చినాడు; అచ్చుగ = స్పష్టముగా; వహి = పుస్తకము - ప్రమాణగ్రంథము - ప్రామాణికముగా నని ఇక్కడి యర్థము. రహిణ్ = ఆనందముతో; మనికి = ఇల్లు చేసుకొని.

---

## పల్లవి

(11-వ పేజీ తరువాయి)

చతికిలబడ్డ ఆమెను కాలితో నెట్టుతూ తలుపు రెక్కలు పట్టుకున్నది చంద్ర.

“చంద్రా! చంద్రా! ఏమిటా గొడవ? ఎంతకీ తగలడవే?” లోపలినుంచి విసుగ్గా కేక.

“ఏమండోయ్, ఇలారండి!” పిలిచింది చంద్ర.

లోపలినించి ఒక స్థూల కాయుడు సువాసనలు వెదజల్లుతూ బయటకొచ్చి “ఏమిటి చంద్రా?” అంటూ ఆమెను చూశాడు. ‘ఎవరది?’ అని చూపులతో ప్రశ్నించాడు.

“చూడండి! ఈ పాడుముండ వచ్చి పీఠం వేసింది. కదలమంటే కదలదు.”

ఆమెకు కళ్లనీళ్లపర్యంతం అయింది. కాని ఆమెకు కళ్ల నీళ్లు రాలేదు.

“అమ్మాయి, రేపు ప్రొద్దున నీ వుండమన్నా, ఒక్క క్షణం ఈ పాపిష్ఠి కొంపలో ఉండను. ఈ లోపల ఆలోచించుకో. నీవు బాగుపడాలని దేవుడు దయతలిస్తే నీకు మంచి బుద్ధే పుట్టుంది. లేదూ,.. .. ”

“ఎవరమ్మా నీవు? ఏమిటీ గొడవ?” మర్యాదగా అడిగాడు అతను.

ఆమె చూడలేదు; మాటాడలేదు.

“మీ అమ్మేనా?” అడిగాడు. చంద్రను.

“అమ్మ! లమ్మ! ఈ పాడుముండ వచ్చి ఒక్కటే గొడవ. నే నేదో తప్పుపని చేస్తున్నానట! బాగుపడాలట! చెవిలో ఊరికే తెగ పోరుతూంది. బయటికి నెట్టి పారేయండి. అబ్బబ్బ!”

“ఎంత కాకపోయినా తల్లి! ఊరుకో చంద్రా! తెల్లవారగానే ఆమె అంత ఆమె పోతుందిగా! ఎవరమ్మా నీవు! చెవికోసిన నక్కల్లే ఊరికే వాగావంటే.. రా చంద్రా! పడిఉంటుందిలే!”

శూలంలా తగిలింది.

“హిఁ. పడివుంటుంది! ముద్రష్టపు ముండా కొడుకా! దాన్ని చెడగొట్టి, దాని జీవితాన్ని నాశనంచేసి, ఇప్పటికైనా దాన్ని బాగుపడనీయ వట్రా?” అని చేతు లెత్తి నేలకు విసిరింది.

వెన్నున బాకు పొడిచినట్లు చటుక్కున వెనక్కి తిరిగి, చంద్ర నడుము వదిలి ఆమెదగ్గిరికి వచ్చి “ముసలమ్మా! నోరు కట్టేసుకుంటావా? బయటికి ఈడ్వమంటావా?” అని గర్జించాడు.

“నీవా ఈడ్చేది?! అహ్హాహఁ. నీవు ఈడవాలసింది మీ అమ్మనా!”

ఆమె కనులు తుడుచుకుంటూ తల వంచింది.

అతడు చంద్రకళ్లల్లోకి చూశాడు కనుసైగ చేసింది.

అతడు ఆమెను రెండు చేతులూ పట్టుకుని గుమ్మందగ్గిరకు ఈడ్చాడు.

గంభీరంగా “అమ్మాయి! నా జీవితం, నా కోసం కాదు; నీ కోసం” అన్నది ఆమె.

గుమ్మం అవతల మెట్లు. అత డామెను వాకిట్లోకి కాలితో తోశాడు.

ఏ ఆటంకం లేకుండా తలుపు రెక్కలు చుంబించుకున్నై.

మళ్లా: మెరుపుతో నయనా, ఉరుములతో భయానా చెప్పింది; బ్రహ్మాండం బ్రద్దలయ్యేట్లు గర్జించింది ఆకాశం. ఉహుఁ. నిరాశ చేసుకుని వలవలా విలపించింది.

కొన్ని క్షణాల్లోనే;—

అంతవరకూ పిచ్చెత్తినట్లు నవ్వుతున్న చీకటి చెట్లు; నిశ్చలమై, అంధకారపు గుట్టలైనవి.

నక్షత్రాలు చీకటి తెరమాటున దాగుకున్నై.

ఆకాశం నిశ్శబ్దం.

ప్రకృతి స్తబ్దం.

— —

కుష్ఠు * బొల్లి

వగైరా మేహపుచ్చలు, సెగ, సవాయివ్యాధులకు, గ్యారంటీచికిత్స. క్యాటలాగుఉచితం. జి. వి. రెడ్డి, ప్రొప్రయిటరు. వి. రెడ్డి & కో. (రిజష్టర్డు) గోపాలపురం. తూ॥గో॥జిల్లా.

గవోక్వాక్
ఒక్క పెరంటు గంటలో గుణము
శేఖర ఫార్మసీ, రాజమండ్రి